నల్లగొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వెలుగుచూసిన నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం వ్యవహారం జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఉద్యోగ విరమణ తర్వాత మరణించిన వ్యక్తిని సర్వీసులో ఉండగానే చనిపోయినట్లు చూపించి, కారుణ్య నియామకం పేరుతో మరొకరికి ఉద్యోగం ఇప్పించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారానికి శాలిగౌరారం మెడికల్ ఆఫీసర్ జారీ చేసిన నకిలీ సర్టిఫికెట్ ఆధారంగా మారిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఆ పత్రంతో ఆఫీస్ సబార్డినేట్ పోస్టులో నియామకం చేపట్టి, సర్వీస్ రిజిస్టర్‌లో పేరు నమోదు చేసినట్లు గుర్తించారు. ఆశ్చర్యకరంగా ఇదే ప్రతిపాదనను డీఎంహెచ్‌వో కార్యాలయం రెండుసార్లు తిరస్కరించినప్పటికీ మూడోసారి మళ్లీ ముందుకు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఈ నియామకం వెనుక ఏకంగా రూ.40 లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరకు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని విచారణకు ఆదేశించడంతో వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. శాలిగౌరారం మెడికల్ ఆఫీసర్‌పై సస్పెన్షన్ వేటు పడటం ఈ కేసులో కీలక పరిణామంగా మారింది. నకిలీ సర్టిఫికెట్‌తో జరిగిన నియామకంపై నల్లగొండ డీఎంహెచ్‌వో డాక్టర్ రాహుల్ ఇచ్చిన వివరణ మరింత చర్చకు దారితీసింది. అసలు అలాంటి ఉద్యోగ నియామకమే జరగలేదని ఆయన పేర్కొన్నారు. అయితే రాజు అనే వ్యక్తి గత నెల 26న పోస్టింగ్ పొంది, అదే నెల 30వ తేదీ వరకు విధులకు హాజరైనట్లు రికార్డులు బయటపడటం సంచలనంగా మారింది. దామరచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అటెండెన్స్ రిజిస్టర్‌లో రాజు పేరు నమోదై ఉండటం ఈ వ్యవహారంలో కీలకంగా నిలిచింది. ఈ వివరాలు బయటకు వచ్చిన తర్వాత కార్యాలయంలో అర్ధరాత్రి జరిగిన పరిణామాలు మరిన్ని అనుమానాలకు కారణమయ్యాయి. పాత హాజరు రిజిస్టర్‌ను చింపివేసి, కొత్త రిజిస్టర్ తయారుచేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. అధికారిక రికార్డుల్లో మార్పులు జరిగాయనే ప్రచారంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై విమర్శలు పెరిగాయి. ఉద్యోగ నియామకం జరగలేదనే వాదనకు హాజరు రికార్డులు విరుద్ధంగా కనిపించడం దర్యాప్తులో కీలక అంశంగా మారింది. ఈ వ్యవహారంలో నల్లగొండ వన్ టౌన్ పోలీసులు రంగంలోకి దిగడంతో దర్యాప్తు మరింత వేగం పుంజుకుంది. వన్ టౌన్ ఇన్‌చార్జ్ సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ వెంకటనారాయణ నేతృత్వంలో గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఉద్యోగ నియామకానికి సంబంధించిన పత్రాలు, సర్వీస్ రికార్డులు, కార్యాలయ రిజిస్టర్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. విచారణ సందర్భంగా కార్యాలయ సూపరింటెండెంట్ జితేందర్ రెడ్డి, సెక్షన్ క్లర్క్ మోహన్, సీసీ రంజిత్‌ను పోలీసులు ప్రశ్నించారు. పలు అంశాలపై వారు స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేకపోయినట్లు తెలుస్తోంది. దర్యాప్తులో భాగంగా డీఎంహెచ్‌వో కార్యాలయ ఏఓతోపాటు మరో సిబ్బందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోనూ నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల జారీపై తనిఖీలు చేపట్టారు. ఒక ఉద్యోగ నియామకంతో మొదలైన ఈ కేసు ఇప్పుడు వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ విభాగాల మధ్య ఉన్న పత్రాల జారీ ప్రక్రియ వరకు విస్తరించింది. దీంతో మరిన్ని కీలక విషయాలు బయటపడే అవకాశముంది. ఈ నకిలీ సర్టిఫికెట్ వ్యవహారంలో కేవలం కింది స్థాయి ఉద్యోగుల పాత్ర మాత్రమే లేదనే ఆరోపణలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. డీఎంహెచ్‌వో కార్యాలయంలోని కొందరు ఉన్నతాధికారుల సహకారంతోనే కారుణ్య నియామక ప్రక్రియ ముందుకు సాగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారీ మొత్తంలో డబ్బు చేతులు మారిందనే ప్రచారం కూడా ఈ వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది. ఇప్పటివరకు శాలిగౌరారం మెడికల్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయగా, మరికొందరు సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే కీలక నిర్ణయాలు తీసుకున్న అధికారుల పాత్రపై కూడా దృష్టి పెట్టాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రెండుసార్లు తిరస్కరించిన ప్రతిపాదన మూడోసారి ఎలా ముందుకు వెళ్లిందనే అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. సర్వీస్ రిజిస్టర్‌లో పేరు నమోదు చేయడం, పోస్టింగ్ ఇవ్వడం, హాజరు నమోదు కావడం వంటి ప్రతి దశలో ఎవరి ఆమోదం ఉందనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. పోలీసుల విచారణతో ఈ వ్యవహారంలో మరికొందరి పాత్ర వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ వ్యవహారం కూడా ఇప్పుడు ఈ కేసులో కీలకంగా మారింది. నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా ఉద్యోగం పొందడమే కాకుండా, అసలు ఆ పత్రాన్ని జారీ చేసిన విధానంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ అధికారులు నోటీసులతో సరిపెడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కార్పొరేషన్ కమిషనర్ సెలవుల్లో ఉండటంతో శాఖాపరమైన చర్యలపై మరింత చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంలో పాత్ర ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ కీలక అధికారి పేరు పదోన్నతుల జాబితాలో ఉండటం కొత్త వివాదానికి కారణమైంది. ఆయన పదోన్నతికి ఇబ్బంది కలగకుండా చర్యలు ఆలస్యం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

బీర్ కంపెనీలకే నీళ్లు

మొదటిపేజీ తరువాయి

మాత్రమే మిగిలాయని పేర్కొన్నారు. మరమ్మతుల తర్వాత కూడా జలాశయాన్ని తిరిగి నింపేందుకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దీంతో సంగారెడ్డి జిల్లాలో తాగునీటి సమస్య తీవ్రమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నారాయణఖేడ్ ప్రాంతంలో మూడు రోజులకోసారి, జహీరాబాద్‌లో రెండు రోజులకోసారి నీరు సరఫరా అవుతోందని వివరించారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పరిశ్రమల అవసరాలకే ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. ఈ వ్యవహారంతో సింగూరు నీటి వినియోగంపై రాజకీయ దుమారం మొదలైంది. సింగూరు జలాశయంలో నీటి కొరత ప్రభావం సాధారణ ప్రజలతోపాటు ప్రముఖ సంస్థలపైనా పడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు. ఐఐటీ హైదరాబాద్, భారత డైనమిక్స్ లిమిటెడ్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ సంస్థలకు నీటిని అందించలేమని ప్రభుత్వం చెప్పినట్లు ఆయన ఆరోపించారు. పారిశ్రామికంగా కీలకమైన సంగారెడ్డి ప్రాంతానికి తాగునీటి విషయంలో అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. ఒకవైపు ప్రజలకు సరిపడా నీళ్లు ఇవ్వలేకపోతున్న ప్రభుత్వం మరోవైపు బీర్ తయారీ కంపెనీలకు సరఫరా కొనసాగిస్తోందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో జలాశయంలో అందుబాటులో ఉన్న నీటిని ఏ అవసరాలకు ఎంత కేటాయిస్తున్నారనే అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా తాగునీరు, వ్యవసాయం, పరిశ్రమల అవసరాల మధ్య సమతుల్యత ఉండాలని హరీశ్ రావు అభిప్రాయపడ్డారు. సింగూరు నీటి నిల్వలు భారీగా తగ్గాయనే ఆయన వ్యాఖ్యలతో జలాశయ నిర్వహణ, మరమ్మతుల ప్రణాళికలపై చర్చ మొదలైంది. వేసవికి ముందే నీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. రైతుల రుణమాఫీ విషయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఒక్క నర్సాపూర్ నియోజకవర్గంలోనే సుమారు 15 వేల మంది రైతులకు ఇప్పటివరకు రుణమాఫీ జరగలేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఏడుపాయల అమ్మవారు, మెదక్ చర్చి మీద ప్రమాణం చేసి మరీ ముఖ్యమంత్రి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్న సమయంలో రుణభారం తగ్గకపోవడం అన్నదాతలకు అదనపు సమస్యగా మారుతోందని పేర్కొన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు అలాగే ఉండటంతో రైతులు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని వివరించారు. రుణమాఫీ అమలులో జాప్యం కారణంగా రైతులకు కొత్త రుణాలు పొందడంలో కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని అభిప్రాయపడ్డారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం ప్రకటించిన ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. తెలంగాణలో కరువు పరిస్థితులపై కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు తక్షణ కరువు సహాయంగా రైతులకు రూ.5 వేల చొప్పున అందిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం అలాంటి ఆర్థిక సాయం ఎందుకు ప్రకటించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆరోపించారు. ఇంత పెద్ద స్థాయిలో వ్యవసాయ నష్టం జరిగినప్పటికీ మంత్రివర్గ సమావేశంలో రైతుల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. పంటలు కోల్పోయిన అన్నదాతలను ఆదుకునే ప్రణాళికల కంటే గ్లోబల్ సమ్మిట్ నిర్వహణపైనే ప్రభుత్వం ఎక్కువ దృష్టి పెడుతోందని మండిపడ్డారు. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించడంతోపాటు పంట నష్టాన్ని అంచనా వేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించకుండా ఇతర కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం సరైన విధానం కాదని హరీశ్ రావు అభిప్రాయపడ్డారు. రైతుబంధు నిధుల పేరుతో వస్తున్న మెసేజ్‌ల వ్యవహారాన్ని కూడా హరీశ్ రావు తెరపైకి తీసుకొచ్చారు. రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ అయ్యాయంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరుతో సందేశాలు వస్తున్నాయని తెలిపారు. అయితే ఆ మెసేజ్‌లను నమ్మి బ్యాంకులకు వెళ్లిన రైతులకు డబ్బులు జమ కాలేదని, అవి నకిలీ సందేశాలని బ్యాంకు సిబ్బంది చెబుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పేరుతో ఇలాంటి మెసేజ్‌లు వస్తున్నా ఇప్పటివరకు బాధ్యులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు.

కుక్కల దాడిలో 15 మేకపిల్లలు మృత్యువాత



చిట్యాల,విశాలభారతి: మండలంలోని ఆరేగూడెం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. వీధి కుక్కల దాడిలో 15 మేకపిల్లలు మృతి చెందాయి.ఆరేగూడెం గ్రామానికి చెందిన అర్రూరి సత్తయ్య మేకలను పెంచుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం రాత్రి మేకలను దొడ్డిలో ఉంచి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి దొడ్డిలోకి చొరబడిన వీధి కుక్కలు మేకపిల్లలపై దాడి చేశాయి. శుక్రవారం ఉదయం దొడ్డి వద్దకు వచ్చిన సత్తయ్య 15 మేకపిల్లలు చనిపోయి కనిపించడంతో బోరున విలపించాడు. ఈ ఘటనలో తనకు సుమారు రూ.1 లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. మేకల పెంపకమే తన జీవనాధారమని, అప్పులు చేసి మేకపిల్లలను కొనుగోలు చేశానని, ఇప్పుడు అంతా కోల్పోయానని సత్తయ్య కన్నీటిపర్యంతమయ్యాడు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని, గ్రామంలో వీధి కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

రహదారి పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

- పబ్బరాజు గౌడ్ మునుగోడు ఎన్నికల సమన్వయకర్త
- ఆకుల ఇంద్రసేనారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్
- మస్తాన్ బాబు యాదవ్ పిఎసిఎస్ చైర్మన్



చౌటుప్పల్, విశాలభారతి: జాతీయ రహదారి నిర్మాణ పనుల నేపథ్యంలో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. రహదారి పనుల వల్ల వాహనదారులు, పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులతో చర్చించారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు తగిన ఏర్పాట్లు చేయాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్,బొబ్బిళ్ళ రాజేందర్, బత్తుల శ్రీహరి, సీతారామచంద్ర ఆలయ చైర్మన్ బొబ్బిలి మురళి, సర్పంచ్ జ్యువి నరసింహ, బొంగు జంగయ్య గౌడ్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు బాబా షరీఫ్, పస్తం గంగారాములు, జంగయ్య, కిరణ్* తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో లారీలకు ఉపాధి కరువు

- టన్నేజీ కి మించి ధాన్యం తరలిస్తున్న డీసీఎంలు
- డీసీఎంల దెబ్బకు విలవిల్లాడుతున్న లారీ యజమానులు



తిరుమలగిరి, విశాలభారతి : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ప్రస్తుతం లారీ యజమానులు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు ధాన్యం, పత్తి, ఇతర పంటల తరలింపులో లారీలదే ప్రధాన పాత్ర ఉండేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మార్కెట్ కు వచ్చే సరుకులో ఎక్కువ భాగం డీసీఎం లలోనే తరలిపోతుండటంతో లారీలకు లోడ్ దొరకడం లేదు. రోజుల తరబడి మార్కెట్ యార్డ్ బయట లారీలు ఖాళీగా నిలిచిపోతున్నాయి. డీజిల్ ధరలు పెరిగిపోయి, ఇన్సూరెన్స్, ట్యాక్స్, ఫైనాన్స్ కట్టలేక లారీ యజమానులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇదిలా ఉంటే మరో వైపు నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. టన్నేజీ కంటే అధిక లోడు వేసుకుని డీసీఎంలు, ఇతర వాహనాలు రోడ్లపై దూసుకుపోతున్నా పట్టించుకునే నాథుడే లేడు. దీని వల్ల ఒక వైపు రోడ్లు దెబ్బతింటుంటే, మరో వైపు ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. నిబంధనల ప్రకారం: వాహనం సామర్థ్యానికి మించి లోడు వేయకూడదు. కానీ మార్కెట్ పరిసరాల్లో, ప్రధాన రహదారులపై ఈ నిబంధన అమలు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తనిఖీలు లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని వారు వాపోతున్నారు. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాలని, మార్కెట్ లో లోడ్ పంపిణీలో పారదర్శకత పాటించాలని లారీ ఓనర్స్ డిమాండ్ చేస్తున్నారు. మార్కెట్ యార్డ్ లో లారీలకు ప్రాధాన్యం ఇచ్చి, ఓవర్ లోడ్ పై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో లారీ రంగమే కుదేలైపోతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పలువురిని పరామర్శించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

- మృతుల చిత్రపటాలకు, భౌతికకాయాలకు పూలమాలలు వేసి నివాళులు



డోర్నకల్ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; డోర్నకల్ పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ శుక్రవారం పరామర్శించారు. డోర్నకల్ పట్టణానికి చెందిన రిటైర్డ్ రైల్వే గార్డు మండలోజు సత్యనారాయణ ఇటీవల మృతి చెందడంతో ఆయన నివాసానికి వెళ్లిన సత్యవతి రాథోడ్, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం డోర్నకల్ ప్రాంతానికి చెందిన బుర్ర శంకర్ ఇటీవల మృతి చెందడంతో ఆయన నివాసానికి చేరుకొని భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను ఓదార్చి తమ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుండాల భాస్కర్, మోయిన్ పాషా, రహీం, కేశవ, కోటిలింగం, బుర్ర శీను, పచ్చిపాల మల్లేశం, గణేష్ సింగ్, ప్యాట్ని బోడా, శ్రీను నాయక్, నెహ్రూ నాయక్, ఎర్ర శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లా రామ్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

- మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి
- కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా

కురవి, విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ; మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం కురవి మండలం నల్లెల్ల గ్రామానికి చెందిన పల్లా రామ్‌రెడ్డి ఇటీవల మృతి చెందడంతో శుక్రవారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, మృతుడి కుమారుడు పల్లా విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా కుటుంబానికి మనోధైర్యం కల్పించి, వారి బాధలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మంచిప్రోలు చంద్రారెడ్డి, బొడ శ్రీనునాయక్, నెహ్రూనాయక్, ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, గుండెబోయిన సూరయ్య, స్థానిక సర్పంచ్ రెంటాల కృష్ణ, ఉపసర్పంచ్ నిమ్మలగంటి కృష్ణమూర్తి, పల్లా సత్తిరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి అంబటి కరుణాకర్, మాజీ ఎంపీటీసీ బానోతు సంజీవ్ నాయక్, మైనార్టీ నాయకులు ముస్తఫా, అంబటి మల్లికార్జున్, పల్లా జనార్దన్‌రెడ్డి, పల్లా వెంకట నరసింహారెడ్డి, పల్లా కృష్ణారెడ్డి, రజక సంఘం నాయకులు అక్కినపల్లి కృష్ణ, మల్లయ్య, వార్డు సభ్యులు షేక్ జానబీ, బానోతు బాలు నాయక్, షేక్ చాంద్ మియా, యువజన సభ్యులు కొరుగంటి ఉపేందర్, షేక్ రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి

- ఎఫ్ఎల్ఎన్ ఫలితాల్లో జిల్లా అగ్రస్థానంలో నిలవాలి
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- విద్యాశాఖపై సుదీర్ఘ సమీక్షలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాలు



మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ; ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు చదవడం, రాయడం, గణితంలో పునాది నైపుణ్యాలను బలోపేతం చేయడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్‌తో కలిసి కలెక్టర్ విద్యాశాఖ పనితీరుపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 107 పాఠశాలల్లో నిర్వహించిన పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్) స్పాట్ అసెస్‌మెంట్ ఫలితాలను సమీక్షించారు. ఫలితాల్లో వెనుకబడిన పాఠశాలలను గుర్తించి, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన అందించాలని, అన్ని ప్రమాణాల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు నిరంతరం పాఠశాలలను సందర్శిస్తూ బోధనా ప్రమాణాలను పరిశీలించాలని సూచించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఇటీవల నిర్వహించిన సమ్మిట్ 1 ఫలితాల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ విభాగాలుగా వర్గీకరించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

మౌలిక వసతుల కల్పనలో జాప్యం సహించేది లేదు.

పీఎం శ్రీ పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధనా సదుపాయాలకు సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, నల్లబల్లలు, బెంచీలు, విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పెండింగ్ పనులపై సంబంధిత అధికారులు తక్షణమే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలతోపాటు ఎఫ్ఎల్ఎన్, లీప్ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాలని, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వంద శాతం నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇందుకోసం తల్లిదండ్రుల్లోనూ విద్యపట్ల అవగాహన కల్పించాలన్నారు. ఇన్‌స్పైర్, డ్రాప్ట్ బాక్సుల క్లియరెన్స్ వంటి అంశాల్లో జిల్లా విద్యాశాఖ రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉండటం అభినందనీయమని తెలిపారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యం.

పదో తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం డిసెంబర్‌లోగా సిలబస్ పూర్తి చేసి, విద్యార్థులకు నిరంతరం పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అత్యంత వెనుకబడిన పాఠశాలలు, విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి అభ్యసన స్థాయిని మెరుగుపరచాలన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక బృందాల వారీగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న విద్యాబోధన, పాఠశాలల పరిస్థితులపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల సందర్శన వివరాలను విద్యాశాఖ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, ఏజీఆర్ రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలను ఉపాధ్యాయులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి అధికారి, ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి జిల్లాను విద్యారంగంలో అగ్రస్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఏంఓలు వెంకటేశ్వర్లు, గాయత్రి, సమన్వయకర్తలు పూర్ణచందర్, సంతోష్, శంకర్, అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


- స్థానిక మండల వైద్య అధికారికి వినతి పత్రం
- డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మెకు ఆశా వర్కర్ల హెచ్చరిక
- ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మె నోటీసు



అడవిదేవులపల్లి విశాలభారతి: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించి, పెండింగ్ డిమాండ్లను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే 2026 డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని యూనియన్ నాయకులు సమ్మె నోటీసు ద్వారా హెచ్చరించారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య సేవలు అందించడంతో పాటు, వ్యాధుల నివారణ, టీకాల కార్యక్రమాలు, ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఇంతటి బాధ్యతలు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లకు ప్రస్తుతం నెలకు కేవలం రూ.9,900 మాత్రమే పారితోషికంగా అందుతోందని, ఐదు సంవత్సరాలుగా పారితోషికాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేల మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.5 లక్షలు చెల్లించాలని కోరారు.ప్రతి ఆదివారం, పండుగలకు వేతనంతో కూడిన సెలవులు, ప్రసూతి సెలవులు, ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, రెండో పీఆర్సీలో ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.30 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ పలుమార్లు ఆందోళనలు, ధర్నాలు చేపట్టినా సమస్యలు పరిష్కారం కాలేదని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ఆశా వర్కర్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు బండారు కళావతి సావిత్రి ఉషారాణి భాగ్యమ్మ జాసకమ్మ బంగారి పద్మ సుజాత నాగలక్ష్మి నాగమణి జయమ్మ తదితరులు పాల్గొన్నారు


యువతలో నాయకత్వ లక్షణాల వికాసానికి యూత్ పార్లమెంట్

- వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ
- జిల్లా స్థాయి పోటీల్లో ముగ్గురు విజేతలకు రాష్ట్ర స్థాయి పోటీలకు అవకాశం.



మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; యువతలో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడంతో పాటు మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 202627 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సేవల అధికారి డా. ఒలేటి జ్యోతి తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను డా. ఒలేటి జ్యోతి, జిల్లా ప్రజా సంబంధాల అధికారి రాజేంద్ర ప్రసాద్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వల్లూరి శ్రీనివాసరావు, ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. ఒలేటి జ్యోతి మాట్లాడుతూ.. యువతలో నాయకత్వ సామర్థ్యాలను వెలికితీయడంతో పాటు ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించేందుకు యూత్ పార్లమెంట్ దోహదపడుతుందన్నారు. 'నశా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్' అనే అంశంపై యువత తమ ఆలోచనలను ధైర్యంగా వ్యక్తపరచాలని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతతోనే ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజా సంబంధాల అధికారి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. కార్యక్రమంపై జిల్లాలోని అన్ని కళాశాలల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తామని, యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్ మహబూబాబాద్ జిల్లా విభాగం ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 10న మహబూబాబాద్‌లోని టీటీడబ్ల్యూఆర్డీసీ బాలికల కళాశాలలో జిల్లా స్థాయి పోటీలు జరగనున్నాయి. 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు అర్హులు. ఎంపికైన అంశంపై మూడు నిమిషాల పాటు ప్రసంగించాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. ఆసక్తి గల యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని లేదా 9959871432 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

కొర్ర లింభ్యా నాయక్ భౌతికకాయానికి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ నివాళి



కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; కురవి మండలం పెద్దతండ గ్రామానికి చెందిన కొర్ర లింభ్యా నాయక్ మృతి చెందడంతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ వారి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం

- గ్రామస్థాయిలో బాలల రక్షణ కమిటీ ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ సూపర్వైజర్ రాణి



మరిపెడ విశాల భారతి: బాలల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం, భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ రాణి అన్నారు. శుక్రవారం మరిపెడ మండలం గిరిపురం గ్రామపంచాయతీలో బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ (విసి పి సి) ఏర్పాటు చేశారు. బాలల హక్కులకు భంగం కలగకుండా చూడటం, బాలల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయడం, వారి రక్షణలో గ్రామస్థాయి కమిటీ కీలక పాత్ర పోషించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాదావత్ నీల సైదులు, ఉపసర్పంచ్ బానోత్ వీరన్న, పంచాయతీ కార్యదర్శి విజిత, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్, అంగన్‌వాడీ టీచర్లు ఉమా, రాధ, సుశీల, ఆశా వర్కర్ వినోద, గ్రామ పెద్దలు, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుటే కత్తిపోట్ల కలకలం

- రూ. 10 వేల గొడవలో రక్తపాతం



నిజామాబాద్, విశాలభారతి: నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని మాణిక్ బండార్ గ్రామంలో శుక్రవారం ఉదయం రూ. 10 వేల ఆర్థిక లావాదేవీల వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామానికి చెందిన వినయ్, శంకర్‌ల మధ్య కొంతకాలంగా ఉన్న పది వేల రూపాయల గొడవ నేపథ్యంలో.. శంకర్ వినయ్ ఇంటికి వెళ్లి డబ్బులు అడగడంతో వివాదం ముదిరింది. ఈ క్రమంలో వినయ్, అతని కుమారుడు కలిసి శంకర్‌పై కట్టె తో దాడి చేయడంతో తలకు గాయమైంది.దీనిపై ఫిర్యాదు చేసేందుకు ఇద్దరూ మాక్లూర్ పోలీస్ స్టేషన్‌కు బయలుదేరగా, స్టేషన్‌కు ఎదురుగానే కారు వద్దకు రాగానే మరోసారి మాటామాటా పెరిగింది.ఈ ఘర్షణలో ఆగ్రహించిన శంకర్.. వినయ్‌పై కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో వినయ్ కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీస్ స్టేషన్ ఎదుటే ఈ రక్తపాత ఘటన జరగడంతో స్థానికంగా కలకలం రేగగా, వెంటనే అప్రమత్తమైన పోలీసులు కత్తితో దాడికి పాల్పడిన శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

ఇందిరమ్మ కమిటీ చైర్మన్ను సర్పంచ్ అధ్యక్షతనే ఏర్పాటు చేయాలి

- సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు మల్లేష్ గౌడ్ డిమాండ్

చౌటుప్పల్, విశాలభారతి: ఇందిరమ్మ ఇండ్లు రెండో విడత సెలక్షన్ కమిటీ చైర్మన్ను గ్రామ సర్పంచ్ అధ్వర్యంలో నియమిస్తూ, పాత ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని కోరుతూ చౌటుప్పల్ మండల సర్పంచులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశమై వినతి పత్రం అందజేశారు. చౌటుప్పల్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, అంకిరెడ్డిగూడెం సర్పంచ్, సర్పంచ్ల ఫోరం చౌటుప్పల్ మండలాధ్యక్షులు సుర్వి మల్లేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సర్పంచులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఎన్నికలకు ముందు వేసిన ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని కోరారు. పంచాయతీరాజ్ 2018 చట్టం ప్రకారం గ్రామ సర్పంచ్ విధులుబాధ్యతలో భాగంగా, గ్రామ అభివృద్ధిసంక్షేమం దృష్ట్యా గ్రామ సర్పంచ్ (చైర్మన్) అధ్యక్షతన గ్రామాల్లో నూతన ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇప్పించాలని ఎంపీడీవో శ్రీమతి శ్రీలత ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. తమ వినతి పత్రాలను సంబంధిత పై అధికారులకు తెలియజేయాలని కోరారు. సర్పంచుల సమస్యలు త్వరలో పరిష్కారం కాకపోతే, పార్టీలకతీతంగా సర్పంచులందరం కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇదే విషయంపై 1732026 రోజున జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి గారికి కూడా వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచులు దండు మల్కాపురం గిర్కంటి నిరంజన్ గౌడ్, కొయ్యలగూడెం కైరం కొండస్వప్న, అల్లాపురం టేకుల మంజుల,మందోల్లగూడెం తంగెళ్ల వెంకటేశం, పెద్ద కొండూరు గుండెబోయిన శిరీష, కుంట్లగూడెం అన్యాలపు నరేష్, జై కేసారం సమ్మిరెడ్డి భారతమ్మ, కాట్రేవ్ బోయ మహేంద్ర మనీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం వద్దు

- డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలి
- బిఆర్ఎస్ నాయకులు - మంద జగన్



సికింద్రాబాద్ వి శాలభారతి : బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని అంబర్ నగర్ బస్తీలో డ్రైనేజీ పైపులైన్ లీకేజీ కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ పైపులైన్ నుంచి మురుగు నీరు లీక్ అవుతూ మంచినీటి పైపులైన్‌లో కలుస్తుండటంతో ప్రజలకు కలుషితమైన నీరు సరఫరా అవుతోందని బస్తివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు మంద జగన్ అక్కడ పర్యటించి సమస్యను పరిశీలించి అధికారాలతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలి!

- జనవరి మొదటి వారంలోగా సమగ్ర శిక్ష, పీఎం శ్రీ నిధుల వినియోగం వందశాతం పూర్తి చేయాలి
- మార్చి నెలాఖరులోగా 12 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం
- వేసవి ముగిసే వరకు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి
- లబ్ధిదారులకు ఉచిత ఇసుక, రాయితీ సిమెంట్ అందించాలి
- జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్



మహబూబాబాద్, జిల్లా (విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా సాధించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరును మరింత మెరుగుపరచాలని, మంజూరైన నిధులను సకాలంలో పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ప్రజలకు పథకాల ఫలాలు అందించాలని స్పష్టం చేశారు. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యా శాఖ, ఉపాధి హామీ, తాగునీటి సరఫరా, చేయూత పింఛన్ల ధ్రువీకరణ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఐడీఓసీ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్లు పురుషోత్తం, కె.అనిల్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు.

నిధుల వినియోగంలో వెనుకబాటుపై సీఎస్ అసంతృప్తి.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎస్ సూచించారు. సమగ్ర శిక్ష, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను జనవరి మొదటి వారంలోగా వందశాతం వినియోగించాలని ఆదేశించారు. పీఎం శ్రీ పథకానికి రూ.538 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు పది శాతం కూడా ఖర్చు చేయకపోవడంపై దృష్టి సారించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 794 పాఠశాలల్లో నిధుల వినియోగంతో పాటు విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు తీసుకోవాలన్నారు. 202627 ఆర్థిక సంవత్సరానికి సమగ్ర శిక్ష కింద రూ.1,763 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు కేవలం రూ.79 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణానికి సమగ్ర శిక్ష, వీబీజీ రామ్ జీ నిధులను సమన్వయంతో వినియోగించుకోవాలని సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు యూనిఫారాలు, విద్యా కిట్లు అందించాలని, మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలను నాణ్యతతో అమలు చేయాలని ఆదేశించారు.

తాగునీటి సమస్య వస్తే ఉపేక్షించేది లేదు.

వేసవి ముగిసే వరకు రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని సీఎస్ స్పష్టం చేశారు. జిల్లా తాగునీటి కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి వారం సమావేశమై సరఫరా పరిస్థితిని సమీక్షించాలన్నారు. చేతిపంపులు, బోరు పంపులు, బహిరంగ బావులకు అవసరమైన మరమ్మతులను నవంబర్ 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి తాగునీటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లలో ఒత్తిడి నియంత్రణ కవాటాలను నిరంతరం పర్యవేక్షించాలని, అక్రమ కనెక్షన్లు, నీటి వృథాను అరికట్టాలని ఆదేశించారు.

12 కోట్ల పనిదినాలే లక్ష్యం.

వీబీజీ రామ్ జీ పథకం ద్వారా నాణ్యమైన, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే పనులు చేపట్టాలని సీఎస్ సూచించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సగటున 5.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నామని, మార్చి నెలాఖరులోగా 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక.. రూ.230కే సిమెంట్ బస్తా.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇళ్ల మంజూరును ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు నూతన గుర్తింపు చిహ్నాలతో కూడిన స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందించాలని, రవాణా ఖర్చులు మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఇందుకోసం 'మన ఇసుక - మన వాహనం' యాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. సిమెంట్ బస్తాను రూ.230కే లబ్ధిదారులకు అందించి ప్రభుత్వ రాయితీ ప్రయోజనాలు పూర్తిస్థాయిలో చేరేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

జిల్లాలో లక్ష్యాల సాధనకు కలెక్టర్ ఆదేశాలు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమీక్షలో సూచించిన అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైతే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. విద్యాశాఖ, భూసేకరణ, వీబీజీ రామ్ జీ పథకం అమలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాల్లో నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి కె.అనిల్ కుమార్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పురుషోత్తం, జిల్లా రెవెన్యూ అధికారి నాగలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన రాజు, తొర్రూరు ఆర్డీఓ గణేష్, మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, మాణిక్యరావు, ఇంటర్మీడియట్ అధికారి మదర్, జిల్లా పంచాయతీ అధికారి రేవంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

రూ.27 లక్షలతో సీసీ రోడ్డు పనులు

- విఘ్నేశ్వర కాలనీ నుంచి పోచమ్మ దేవాలయం
- వరకు రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ : ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి సహకారంతో పెద్ద అంబర్‌పేట్ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (MMC) 52వ డివిజన్ పరిధిలోని విఘ్నేశ్వర కాలనీ నుంచి పోచమ్మ దేవాలయం వరకు రూ.27 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక తాజా మాజీ కౌన్సిలర్ వద్దేపల్లి విద్యా విజేందర్ రెడ్డి పరిశీలించారు. స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఘ్నేశ్వర కాలనీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, రఘుపతి, వద్దేపల్లి ప్రతాప్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సమ్మయ్యతో పాటు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు. తమ ప్రాంతంలో రహదారి సౌకర్యం మెరుగుపడేలా అభివృద్ధి పనులకు కృషి చేస్తున్న వద్దేపల్లి విద్యా విజేందర్ రెడ్డికి కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

రంగారెడ్డి జిల్లా అస్తిత్వాన్ని కాపాడేందుకు పోరాటం

- జిల్లా విభజన నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలి
- అవసరమైతే ప్రజా ఉద్యమం చేపడతాం
- మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి



విశాల భారతి, ఇబ్రహీంపట్నం / అబ్దుల్లాపూర్ మెట్ : రంగారెడ్డి జిల్లా అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని పలు మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా మార్చి GHMC, MMC, CMCల్లో విలీనం చేయడం ద్వారా ప్రజలపై పన్నుల భారం పెంచారని విమర్శించారు. ఈ చర్యలు ప్రజల జీవన విధానంపై ప్రభావం చూపడమే కాకుండా రంగారెడ్డి జిల్లా ఉనికికే గొడ్డలిపెట్టుగా మారాయని ఆరోపించారు.ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలను మూడు భాగాలుగా విభజిస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని అన్నారు. ఇలాంటి నిర్ణయాలతో ప్రాంత అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారుతుందని, ప్రజల ప్రయోజనాలను ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. దివంగత కే.వి. రంగారెడ్డి పేరు మీద ఏర్పడిన జిల్లాను కనుమరుగు చేసి, మరో పేరు పెట్టే ఆలోచన ప్రభుత్వం చేస్తోందా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబానికి చెందిన జైపాల్ రెడ్డి పేరు పెట్టాలని యోచిస్తున్నారా? అని ప్రశ్నించారు. రాజకీయ కారణాలతో జిల్లా పేరును, అస్తిత్వాన్ని మార్చే ప్రయత్నాలు చేయడం సరికాదని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. జిల్లా ఉనికిని దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి తాజా మాజీ కార్పొరేటర్ వినతి

- నూతన భూగర్భ డ్రైనేజీ పనులు మంజూరు చేయాలి



విశాలభారతి, ఎల్బీనగర్ : బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు నూతన భూగర్భ డ్రైనేజీ పనులు వెంటనే మంజూరు చేయాలని తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కోరారు. ఈ మేరకు జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ED) పంకజను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ

ఈ సందర్భంగా మొద్దు లచ్చి రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో డ్రైనేజీ సమస్యల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈడీ దృష్టికి తీసుకెళ్లారు. పెరుగుతున్న జనాభా, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆధునిక భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నూతన డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

క్షేత్రస్థాయి పరిశీలనకు ఈడీ హామీ

మొద్దు లచ్చి రెడ్డి వినతిపై జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించి, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

న్యాయస్థాన ప్రాంగణంలో బాలింతలకు ప్రత్యేక గది ప్రారంభం



- మహిళా సాధికారతకు పెద్దపీట..
- తల్లులు, శిశువుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాటు.
- ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళి మోహన్

మహబూబాబాద్, జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ; న్యాయస్థానానికి వివిధ కేసుల విచారణలు, న్యాయ సేవల కోసం వచ్చే బాలింతలు, తల్లుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కోర్టు ప్రాంగణంలో ప్రత్యేక తల్లిపాలు పట్టే గదిని ఏర్పాటు చేశారు. మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ప్రత్యేక గదిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళి మోహన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్టు పనుల నిమిత్తం వచ్చే బాలింతలు తమ పసిబిడ్డలకు ప్రశాంతమైన, గోప్యతతో కూడిన వాతావరణంలో తల్లిపాలు పట్టేందుకు ఈ గది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు, చిన్నారుల హక్కులు, రక్షణకు ప్రాధాన్యతనివ్వడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పని ప్రదేశాల్లో మహిళలకు అవసరమైన ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం వారి హక్కులో భాగమని స్పష్టం చేశారు. అనంతరం మహిళలు, బాలల భద్రత కోసం అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లతో రూపొందించిన సమాచార బోర్డును ఆవిష్కరించారు. ఈ సదుపాయాన్ని తక్కువ సమయంలో నాణ్యతతో ఏర్పాటు చేసిన జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను, సిబ్బందిని అభినందించారు. సీనియర్ సివిల్ న్యాయమూర్తి షాలిని షాకెల్లి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న మహిళలు, బాధితులు టోల్‌ఫ్రీ నంబర్లను సద్వినియోగం చేసుకుని తక్షణ సహాయం పొందాలని సూచించారు. మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో మహిళా సాధికారత కేంద్రం చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ఫీ బోర్డుపై "ఆడపిల్లలను రక్షిద్దాం - ఆడపిల్లలను చదివిద్దాం" అనే సందేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాలికల విద్య, రక్షణపై ప్రతి ఒక్కరిలో బాధ్యత పెంపొందించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి అర్వపల్లి కృష్ణతేజ, కోర్టు ముఖ్య పరిపాలన అధికారి, జిల్లా సంక్షేమ అధికారి శిరీష, మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త మహేశ్వరి, జెండర్ స్పెషలిస్టులు అరుణ, సంధ్యారాణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బాలరాజు యాదవ్ అరెస్టు అప్రజాస్వామికం

- బేషరతుగా విడుదల చేయాలి : ఉయ్యాల ప్రశాంత్ గౌడ్



విశాల భారతి, ఎల్బీనగర్ : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బల్మూరి వెంకట్ చేసిన వ్యాఖ్యలను ప్రశ్నించినందుకే మాజీ కార్పొరేషన్ చైర్మన్ దుదిమెట్ల బాలరాజు యాదవ్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ యువజన నాయకుడు ఉయ్యాల ప్రశాంత్ గౌడ్ తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కాలరాసే విధంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. బాలరాజు యాదవ్‌పై అక్రమ కేసులు నమోదు చేయకుండా, ఆయనను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆటో లింగయ్య మృతి.. సీపీఐ నాయకుల నివాళులు



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని రవి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్ 2కు చెందిన ముదివేడు (ఆటో) లింగయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి సీపీఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి, సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్‌తో పాటు ధూపం నిరంజన్, కట్ట కృష్ణయ్య, రాజు, వీరస్వామి, బొజ్జా రాజు తదితరులు పాల్గొని లింగయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఎల్ బి నగర్ అగ్నిమాపక కేంద్రంపై ఏసీబీ దాడులు

- క్రాకర్స్ షాపుల అనుమతుల కోసం లంచం డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు



విశాల భారతి, ఎల్బీనగర్ : ఉప్పల్ భగాయత్‌లోని అగ్నిమాపక కేంద్రంపై రంగారెడ్డి ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. క్రాకర్స్ షాపుల ఏర్పాటుకు అనుమతులు పొందేందుకు వచ్చిన దరఖాస్తుదారుల నుంచి అధికారులు లంచం డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ సోదాలు చేపట్టినట్లు సమాచారం. రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో ఇన్‌చార్జి సీఐతో పాటు మరికొందరు అధికారుల వద్ద ఉన్న రూ.40 వేల నగదును గుర్తించినట్లు తెలిసింది. అలాగే 80 ఆన్‌లైన్ లావాదేవీలకు సంబంధించిన వివరాలను కూడా ఏసీబీ అధికారులు గుర్తించి పరిశీలిస్తున్నట్లు సమాచారం. క్రాకర్స్ షాపుల అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తుల్లో చాలావరకు పెండింగ్‌లో ఉండటంతో వాటిని సైతం అధికారులు పరిశీలిస్తున్నారు. లంచం డిమాండ్ ఆరోపణలపై సంబంధిత అధికారులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఏసీబీ విచారణ పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ పాలకేంద్రం

- పోచారంలో కల్తీ పాల తయారు చిట్ట బట్టబయలు.
- హైడ్రోజన్ పెరాక్సైడ్, పాలపొడితో కల్తీ పాలు తయారీ.
- నగరానికి సరఫరా చేస్తున్న వ్యాపారి అదుపులోకి.
- దాడి చేసి నిల్వలను స్వాధీనం చేసుకున్న మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు.



విశాల భారతి ఇబ్రహీంపట్నం ; ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ లాభార్జనే ధ్యేయంగా కల్తీ పాల తయారీకి పాల్పడుతున్న ఓ ముఠా వ్యవహారాన్ని మహేశ్వరం ఎస్ఓటీ (స్పెషల్ ఆపరేషన్స్ టీమ్) పోలీసులు బట్టబయలు చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పోచారం గ్రామంలో గురువారం రాత్రి 10:30 గంటల సమయంలో నిర్వహించిన మెరుపు దాడిలో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది.

విశ్వసనీయ సమాచారంతో దాడి.

పోచారం గ్రామంలోని ఓ ఇంట్లో రహస్యంగా కల్తీ పాలు తయారు చేస్తున్నట్లు మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులకు స్పష్టమైన ముందస్తు సమాచారం అందింది. దీంతో ఎస్ఓటీ బృందం సదరు ఇంటిపై హఠాత్తుగా దాడి చేసింది. ఆ సమయంలో ప్రాణాలకు హాని కలిగించే ప్రమాదకర 'హైడ్రోజన్ పెరాక్సైడ్', 'ధోల్పూర్ పాలపొడి'లను నీటిలో కలిపి కృత్రిమంగా కల్తీ పాలను తయారు చేస్తున్న దృశ్యాలను పోలీసులు గుర్తించి షాక్‌కు గురయ్యారు.

నగరానికి కల్తీ విక్రయాలు.

ఇలా తయారు చేసిన విషతుల్యమైన కల్తీ పాలను ప్రతిరోజూ హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల వినియోగదారులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారానికి సూత్రధారి అయిన పాల వ్యాపారి అండే శ్రీశైలం (43)ను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

భారీగా సామాగ్రి స్వాధీనం

సంఘటనా స్థలం నుండి పోలీసులు 100 లీటర్ల కల్తీ పాలు, 1 లీటరు హైడ్రోజన్ పెరాక్సైడ్ కెమికల్, అలాగే కిలో బరువు కలిగిన 35 'ధోల్పూర్ పాలపొడి' ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అండే శ్రీశైలంపై కేసు నమోదు చేసి, ఈ కల్తీ దందా వెనుక ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకులు సకాలంలో రుణ ఉపశమనం అందించాలి



- రైతుల రుణ వసులపై మానవత్వ దృక్పథంతో వ్యవహరించాలి
- ల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి

విశాలభారతి ఇబ్రహీంపట్నం: కరువు ప్రభావిత రైతులకు ఆర్థికంగా అండగా నిలవాలని, అర్హులైన రైతుల పంట రుణాలను నిబంధనల ప్రకారం దీర్ఘకాలిక రుణాలుగా పునర్వ్యవస్థీకరించి సకాలంలో ఉపశమనం కల్పించాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) డాక్టర్ కిరణ్మయి బ్యాంకర్లకు సూచించారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఐఏఎస్ మార్గదర్శకత్వంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుశీల్ కుమార్ కె.పి. ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ (DCC) సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.03, తేదీ 24102026 ప్రకారం ఆర్బీఐ మార్గదర్శకాలు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (SLBC) తీర్మానాలను బ్యాంకులు అమలు చేయాలని సూచించారు.జిల్లాలో మొత్తం 18 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించగా, వాటిలో 5 తీవ్ర కరువు ప్రభావిత మండలాలు, 13 మధ్యస్థ కరువు ప్రభావిత మండలాలు ఉన్నాయని తెలిపారు. మధ్యస్థ కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతులకు 12 నెలల మారటోరియంతో పాటు తదుపరి 24 నెలల వరకు, తీవ్ర కరువు ప్రభావిత మండలాల్లో 12 నెలల మారటోరియంతో పాటు తదుపరి 48 నెలల వరకు రుణాల చెల్లింపు గడువు కల్పించే విధానాన్ని వివరించారు.లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ, బ్యాంకర్లు మానవతా దృక్పథంతో వ్యవహరించి అర్హులైన రైతులను గుర్తించి, రుణ పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని, అవసరమైన కొత్త రుణాలను సకాలంలో అందించాలని కోరారు. ఆర్బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ రుణాల పునర్వ్యవస్థీకరణ విధానం, అర్హతలు, అమలు ప్రక్రియపై వివరించగా, నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ హర్ష రైతులకు అందించాల్సిన రుణ ఉపశమన చర్యలను వివరించారు. పంటల బీమా పరిహారం అందే వరకు వేచి చూడకుండా అర్హత మేరకు అదనపు ఆర్థిక సహాయం, తాజా రుణాలు అందించాలని సమావేశంలో సూచించారు.రైతులపై రుణ వసూళ్ల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, కరువు పరిస్థితుల్లో వారికి అండగా నిలవాలని బ్యాంకర్లకు సూచించారు. ఈ సమావేశంలో ఎల్ డి ఎం సుశీల్ కుమార్, అన్ని బ్యాంకుల ప్రతినిధులు, పిడి డిఆర్డిఏ శ్రీలత, పిడి మెప్మా వెంకట నారాయణ, వ్యవసాయ శాఖ అధికారి సుజాత, అధికారులు పాల్గొన్నారు.

హయత్‌నగర్–కుంట్లూరు రోడ్డుకు ఆక్రమణల అడ్డంకి!

- ఎస్బీఐ ప్రహరీ గోడ తొలగించి.. కుంట్లూరు బస్టాండ్ వరకు సీసీ రోడ్డు నిర్మించాలి



విశాల భారతి, ఎల్ బి నగర్ : హయత్‌నగర్ నుంచి కుంట్లూరు వెళ్లే ప్రధాన రహదారిపై ఎస్బీఐ బ్రాంచ్ ప్రహరీ గోడ రోడ్డులోకి సుమారు 20 అడుగుల మేర విస్తరించి ఉండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, రోడ్డుకు అడ్డంకిగా ఉన్న ప్రహరీ గోడను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హయత్‌నగర్ నుంచి కుంట్లూరు బస్టాండ్ వరకు ఎలాంటి ఆక్రమణలు లేకుండా రహదారిని విస్తరించి, పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డుకు ఎడమ వైపు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నందున రహదారి విస్తరణకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ మార్గం కుంట్లూరు, పసుమాముల, తారామతిపేట ఔటర్ రింగ్ రోడ్ జంక్షన్‌కు వెళ్లే వాహనదారులకు హయత్‌నగర్ నుంచి సులభమైన మార్గమని, రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సామ తిరుమల రెడ్డి కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

- తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు



ముషీరాబాద్,విశాలభారతి: తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటుకు క్యాబినెట్లో నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వర్గానికి తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం లోయర్ ట్యాంక్ బండ్ వద్ద జరిగిన సంఘం సమావేశంలో అధ్యక్షులు లోకిని రాజు మాట్లాడుతూ ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని గత కొంతకాలంగా పోరాటం చేస్తున్నామని ప్రభుత్వం గుర్తించడం సంతోషదాయకమన్నారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ కలిసి ఉండడంతో ఆదివాసి తెగులు ఎంతో అన్యాయానికి గురయ్యాయని తెలిపారు. ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటుకు చొరవ చూపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివాసి ఎరుకల జాతిని గుర్తించి ఎస్టీ కమిషన్ చైర్మన్గా ఎరుకల సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి మార్కెట్ యార్డులో నూతన క్యాటిల్ షెడ్ ప్రారంభం

- రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



రాజేంద్రనగర్, విశాల భారతి : నార్సింగి వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన క్యాటిల్ షెడ్‌ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చిన నూతన సౌకర్యాన్ని పరిశీలించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మీశ్రీ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, మార్కెట్ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నిర్మించిన క్యాటిల్ షెడ్ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సహకారంతో నార్సింగి వ్యవసాయ మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి చేయడంతో పాటు రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం ద్వారా మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మార్కెట్ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యుల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, వైస్ చైర్మన్ వేణు గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, అశోక్ యాదవ్, మణికొండ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మార్కెట్ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కేసీఆర్ చేసిన బీసీ అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోంది!


- కమిటీల పేరుతో కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్ర
- జీవో 14ను తక్షణమే రద్దు చేయాలి
- లేకుంటే కాంగ్రెస్‌కు రాజకీయ పతనం తప్పదు
- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



విశాల భారతి,షాద్ నగర్: బీసీల అభ్యున్నతి, ఆత్మగౌరవం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కృషిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విమర్శించారు. కమిటీల పేరుతో బీసీ కులాల మధ్య ఐక్యతను దెబ్బతీసి,అనైక్యత సృష్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో అంజయ్య యాదవ్ మాట్లాడారు.గతంలో ఏ నాయకుడు ఆలోచించని విధంగా బీసీ కులాల అభివృద్ధి, ఐక్యత, ఆత్మగౌరవం కోసం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో విలువైన స్థలాలను కేటాయించి, వివిధ బీసీ కుల సంఘాలకు ప్రత్యేక భవనాలను నిర్మించి అందించారని గుర్తుచేశారు. బీసీ సంఘాలు తమకు కేటాయించిన భవనాలను స్వయంగా నిర్వహించుకుంటూ ఆయా వర్గాల ప్రజలకు సేవలందిస్తున్నాయని పేర్కొన్నారు.హైదరాబాద్‌లోరెడ్డి హాస్టల్ ఏర్పాటు వల్ల ఎంతోమంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతున్నప్పుడు,బీసీ కుల సంఘాలు తమ భవనాలను నిర్వహించుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకు ఇష్టం లేదని ప్రశ్నించారు.బీసీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంత ఆలోచనతో ఒక్క మంచి కార్యక్రమమైనా చేపట్టారా అని నిలదీశారు. బీసీల హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధికి విఘాతం కలిగించే విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.బీసీ కుల సంఘాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలను మానుకోవాలని, జీవో నంబర్ 14ను తక్షణమే రద్దు చేయాలని అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో మాల్ సర్పంచ్ బెల్లి అశోక్ కాంగ్రెస్ పార్టీలో చేరిక

- ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై
- మాల్ గ్రామ అభివృద్ధి కోసం పార్టీలో చేరిక



విశాల భారతి ఇబ్రహీంపట్నం; యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామ సర్పంచ్ బెల్లి అశోక్ గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మల్ రెడ్డి రంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ శాలువా కప్పి బెల్లి అశోక్ ను సన్మానించారు. ఈ సందర్భంగా మాల్ గ్రామ సర్పంచ్ బెల్లి అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రభుత్వం చేపట్టిన ఉచిత రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఉచిత బస్సు ప్రయాణం, తదితర సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, మాల్ గ్రామ అభివృద్ధి కోసం, గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య.. కుటుంబంలో విషాదం



పాల్వంచ విశాల భారతి క్రైమ్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని నగరం కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. నగరం కాలనీకి చెందిన బానోత్ రాము (తండ్రి: కంతు) మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, రాము భార్య శైలజ గత సుమారు 10 నెలలుగా తన పుట్టింటిలో ఉంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రాము ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. మృతుడు రాముకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో ఒకరికి 8 సంవత్సరాలు, మరొకరికి 5 సంవత్సరాల వయస్సు ఉంది. కుటుంబానికి ఏకైక కుమారుడైన రాము మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల పూర్తి కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వివాహ నిశ్చితార్థ వేడుకకు హాజరైన జక్కిడి శివచరణ్ రెడ్డి

- కాబోయే నూతన వధూవరులకు ఆశీర్వాదాలు



విశాల భారతి, హైదరాబాద్ : వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కుమార్తె డా. గాయత్రి-రామ్ నాయక్ వివాహ నిశ్చితార్థ వేడుకకు తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి TGMREIS అధ్యక్షులు ఫహీమ్ ఖురేషి, సీనియర్ నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్‌లతో కలిసి హాజరైన ఆయన కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభాత్ నగర్ పార్కులో గేటు నిర్మాణానికి అనుమతించేది లేదు!

- పార్కు స్థలాన్ని కాపాడాలి.. జోనల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వినతి
- కాలనీవాసుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలి
- పార్కు స్థలానికి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గం చూడాలి
- పార్కు పరిరక్షణకు కాలనీవాసులతో కలిసి పోరాటం చేస్తాం



విశాల భారతి, ఎల్బీనగర్ : ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని చైతన్యపురి డివిజన్ ప్రభాత్ నగర్ కాలనీ పార్కు స్థలాన్ని పరిరక్షించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అధికారులను కోరారు. పార్కులోకి ఆసుపత్రి నుంచి ప్రవేశించేందుకు గేటు నిర్మాణం చేపడుతున్నారంటూ కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే స్పందించారు. ఈ మేరకు కాలనీవాసులతో కలిసి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతోను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

కాలనీవాసుల అభ్యంతరాలు పట్టించుకోవాలి

గతంలో మార్నింగ్ వాక్‌లో భాగంగా ప్రభాత్ నగర్ పార్కును సందర్శించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అక్కడి పరిస్థితులను పరిశీలించి కాలనీవాసుల అభ్యంతరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభాత్ నగర్ కాలనీ లేఅవుట్‌లో భాగంగా ఈ స్థలాన్ని ఓపెన్ స్పేస్‌గా కేటాయించారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా చిన్నారులు, పెద్దలు, మహిళలు ఉదయం, సాయంత్రం పార్కులో వాకింగ్, యోగా చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. అలాంటి పార్కులోకి ఆసుపత్రి నుంచి గేటు ఏర్పాటు చేస్తే పార్కు వినియోగానికి, కాలనీవాసుల ప్రశాంతతకు ఆటంకం కలిగే అవకాశం ఉందన్నారు.

పార్కు స్థలానికి నష్టం కలగకుండా ప్రత్యామ్నాయం చూడాలి

ఆసుపత్రికి గేటు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటే పార్కు స్థలానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గంలో ఏర్పాటు చేసుకోవాలని జోనల్ కమిషనర్‌కు సూచించారు. పార్కు అనేది కాలనీవాసుల కోసం కేటాయించిన ఓపెన్ స్పేస్ అని, దాని స్వరూపాన్ని మార్చేలా ఎలాంటి నిర్మాణాలు లేదా గేట్ల ఏర్పాటు చేపట్టడానికి వీల్లేదని స్పష్టం చేశారు.

పార్కు స్థలాన్ని కాపాడుకునేందుకు పోరాటం

గతంలో టిమ్స్ ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమంలో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 26 అంతస్తుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. అప్పట్లోనే ఆసుపత్రి ప్రాంగణంలో పార్కు, రిజర్వాయర్, సబ్‌స్టేషన్, పోలీస్ స్టేషన్ వంటి మౌలిక సదుపాయాల నిర్మాణాల కోసం జీవో తీసుకువచ్చారని తెలిపారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తూ 26 అంతస్తులకు బదులుగా కేవలం 13 అంతస్తులకే నిర్మాణాలు చేపట్టిందని విమర్శించారు. ప్రభాత్ నగర్ పార్కు స్థలం కాలనీవాసుల హక్కు అని, దానిని కాపాడుకోవడానికి స్థానికులతో కలిసి పోరాడుతామని, ఎట్టి పరిస్థితుల్లోనూ పార్కు స్థలానికి నష్టం కలగనివ్వబోమని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, తోట మహేష్ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, త్రివేది, పవన్, జయశ్రీ, గట్టు శీను, రమణారెడ్డి, కాలనీ అధ్యక్షులు బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో పబ్లిక్ రీడింగ్ రూమ్ ప్రారంభం



- విద్యార్థులకు , నిరుద్యోగ యువతకు పుస్తకాలు సైకిళ్ల పంపిణీ

రాజేంద్రనగర్,విశాల భారతి : రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో విద్యాభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు మెరుగైన విద్యా, పఠన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఖానాపూర్ గ్రామంలో పబ్లిక్ రీడింగ్ రూమ్‌ను ప్రారంభించగా, అనంతారం గ్రామంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, సైకిళ్లను పంపిణీ చేశారు. ఖానాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ రీడింగ్ రూమ్‌ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్‌తో కలిసి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, నిరుద్యోగ యువతకు చదువుకునేందుకు అనువైన వాతావరణం, అవసరమైన సదుపాయాలు కల్పించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు పబ్లిక్ రీడింగ్ రూమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు చదివే కేంద్రాలే కాకుండా విద్యార్థుల్లో విజ్ఞానాన్ని, ఆలోచనా శక్తిని, సామాజిక అవగాహనను పెంపొందించే వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల యువత కూడా పట్టణ ప్రాంతాల విద్యార్థులతో సమానంగా పోటీ పరీక్షల్లో రాణించాలంటే ఇలాంటి పఠన సదుపాయాలు అందుబాటులో ఉండాలని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం అనంతారం గ్రామంలో రాజ్యలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, సైకిళ్లను పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు వారి చదువుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తకాలు విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తాయని, సైకిళ్ల పంపిణీ వల్ల పాఠశాలలకు రాకపోకలు సాగించే విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రాణి, అమరేందర్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సదుపాయాల కల్పనతో పాటు పేద, మధ్యతరగతి విద్యార్థులను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని స్థానికులు ఆకాంక్షించారు.

ఆగ్రో ఫారెస్ట్రీ విధానాలను రైతులందరూ అనుసరించాలి


- ఆగ్రోఫారెస్ట్రీ పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం
- జిల్లా ఉద్యానవన అధికారి సురేష్



విశాలభారతి ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా, యాచారం మండలంలోని రైతు వేదికలో శుక్రవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆగ్రో ఫారెస్ట్రీ పంటల సాగు, వాటి ప్రాముఖ్యత ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ఉద్యానవన అధికారి సురేష్ మాట్లాడుతూ రైతులు సంప్రదాయ వ్యవసాయ పంటలతో పాటు ఆగ్రోఫారెస్ట్రీ విధానాన్ని కూడా అనుసరించాలని సూచించారు. వేప, చింత, ఇప్ప, కుంకుడు (Soapnut), మునగ వంటి చెట్లను తమ భూముల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పెంచడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. ఈ చెట్ల ద్వారా లభించే కాయలు, విత్తనాలు, ఆకులు ఇతర ఉత్పత్తులకు మార్కెట్లో మంచి అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా కుంకుడు, వేప, చింత వంటి చెట్ల ఉత్పత్తులకు వివిధ పరిశ్రమల్లో వినియోగం ఉందని తెలిపారు. మునగ సాగు ద్వారా ఆకులు, కాయల రూపంలో తక్కువ కాలంలోనే ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు. ఆగ్రోఫారెస్ట్రీ విధానం ద్వారా నేల కోతను నివారించడం, భూసారాన్ని మెరుగుపరచడం, జీవవైవిధ్యాన్ని కాపాడటం, పర్యావరణ సమతుల్యతను పెంపొందించడం సాధ్యమవుతుందని తెలిపారు. రైతులు తమ పొలాల గట్ల వెంట అనువైన ప్రదేశాల్లో బహుళ ప్రయోజనాలనిచ్చే చెట్లను పెంచాలని సూచించారు. ఏ డి హెచ్ అరుణ మాట్లాడుతూ రైతులు ఆగ్రోఫారెస్ట్రీ పద్ధతులను అవలంబించడం ద్వారా వ్యవసాయంతో పాటు దీర్ఘకాలిక ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. సి.ఎ స్.ఎ సభ్యులు రాంబాబు కూడా పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి సురేష్, ఏ డి హెచ్ అరుణ సి ఎస్ ఏ సభ్యులు రాంబాబు, ఉద్యాన శాఖ అధికారి నవీనా, వ్యవసాయ అధికారి రవినాథ్, హెచ్ ఇ ఓ లు, ఏ ఈ ఓ లు రైతులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో వృద్ధుడు అదృశ్యం..ఆచూకీ తెలిపితే పారితోషకం

- కుంట్లూరు రోడ్డులో చివరిసారిగా కనిపించిన చుంచు రాములు ..
- పోలీసులకు ఫిర్యాదు



విశాల భారతి,అబ్దుల్లాపూర్ మెట్ : హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన కలకలం రేపుతోంది. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం 70 ఏళ్లు పైబడిన చుంచు రాములు తండ్రి ఎల్లయ్య అనే వ్యక్తి నవంబర్ 4వ తేదీన కుంట్లూరు రోడ్డులోని వై జంక్షన్, రాజధాని బ్యాంక్ ప్రాంతం సమీపంలో చివరిసారిగా కనిపించినట్లు తెలిపారు. అక్కడి నుంచి వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. అదృశ్యమైన వ్యక్తి రాములు వృత్తిరీత్యా రైతు అని, ఎస్సీ కాలనీ ప్రాంతానికి చెందినవారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై నవంబర్ 5వ తేదీన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు వివరాలు స్వీకరించారు. వృద్ధుడి ఆచూకీ తెలిసినవారు లేదా ఎక్కడైనా కనిపించినవారు వెంటనే క్రింది నంబర్లకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. రాములు ఆచూకీ తెలిపి కుటుంబ సభ్యులకు అప్పగించడంలో సహకరించిన వారికి తగిన పారితోషకం అందజేస్తామని తెలిపారు. సమాచారం అందించాల్సిన ఫోన్ నంబర్లు: 95731 58136, 76719 08388 వృద్ధుడి ఆచూకీ కనుగొనేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కోకాపేటలో మున్నూరు కాపు ఆత్మగౌరవ భవనానికి రూ.5 కోట్లు

- నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు
- హైదర్ నగర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నేత పోతుల రాజేందర్ పటేల్



సైబరాబాద్ విశాల భారతి; కోకాపేటలో నిర్మించనున్న మున్నూరు కాపు ఆత్మగౌరవ భవనానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిర్ణయం పట్ల మున్నూరు కాపు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.భవన నిర్మాణానికి నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి మున్నూరు కాపు సంఘం పటేల్స్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల రాజేందర్ పటేల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయం మున్నూరు కాపు సామాజిక వర్గ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల సమాజం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

నీటి సంరక్షణపై కాలనీవాసులకు అవగాహన

- శుద్ధి చేసిన నీటిని వినియోగించుకోవాలి.. వృథాను అరికట్టాలి
- ఉప కమిషనర్ చాముండేశ్వరి



సైబరాబాద్ విశాల భారతి; ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని ఆల్విన్ కాలనీ సర్కిల్ ఉప కమిషనర్ చాముండేశ్వరి సూచించారు. ఈ సందర్భంగా ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ కాలనీలో పర్యటించి, నీటి సంరక్షణపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఇంటి అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించుకోవాలని, వాహనాలు, ఇళ్లను శుభ్రం చేసే పేరుతో మంచి నీటిని వృథా చేయవద్దని, దీపావళి వేడుకల నేపథ్యంలోనూ నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శుద్ధి చేసిన నీటి కోసం 155313 నంబర్‌కు ఫోన్ చేసి గ్రీన్ ట్యాంకర్లను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం ఎస్ఆర్‌పీ, ఎస్ఎఫ్ఏ సిబ్బందితో కలిసి ఇంటింటికీ చెత్త సేకరణ తీరును పరిశీలించి, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు.

శిలాఫలకం కోసం స్థల పరిశీలన

- ఏ ఈ గూడూరు సర్పంచ్ సునీత కొమ్మలు నాయక్



విశాల భారతి, గూడూరు: గూడూరు నెక్కొండ గూడూరు కేసముద్రం హైవే రోడ్డు సాంక్షన్ కాగా దానికి సంబంధించిన ఏఈ గూడూరు కి విచ్చేయగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి శంకుస్థాపన శిలాఫలకం కోసం స్థలాన్ని పర్యవేక్షించిన గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మలు నాయక్ గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి. గూడూరు ఉపసర్పంచ్ చంటి స్వామి. టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు రసమల్ల యాకయ్య. జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఎం డి రసూల్. టౌన్ కార్యదర్శి సూర శ్రీను. వార్డు మెంబర్లు. వాంకుడోత్ శ్రీనివాస్.గార్లపాటి శిరీష. చీర బోయిన కుమార్. పత్యం వెంకన్న.మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. తంగెళ్లపల్లి సునీల్. బుర్ర జోగయ్య. గోపగాని శ్రీనివాస్. గోనే శోభన్. మైనార్టీ మండల నాయకులు చాంద్ పాషా. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగెల్లి వీరస్వామి. ఓర్సు రాజేందర్. పంజరబోయిన శ్రీను.కప్పల అనిల్. మండల యూత్ కాంగ్రెస్ నాయకులు.షాజహాన్. రాజేష్.రంజిత్. యాదగిరి. గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి సర్కిల్ అభివృద్ధికి రూ.6.48 కోట్ల నిధులు

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపనలు



రాజేంద్రనగర్, విశాలభారతి : నార్సింగి సర్కిల్ పరిధిలోని నార్సింగి, ఖానాపూర్, గండిపేట్, వట్టినాగులపల్లి ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రూ.6 కోట్ల 48 లక్షల 60 వేల విలువైన వివిధ అభివృద్ధి పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపనలు చేయడంతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పార్కులు, గ్రంథాలయాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నార్సింగి 124వ వార్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.28.50 లక్షల వ్యయంతో నిర్మించిన పశువుల షెడ్డును ప్రారంభించారు. ఖానాపూర్, గండిపేట్ 126వ వార్డులో రూ.20 లక్షలతో గ్రంథాలయ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అలాగే నార్సింగి 124వ వార్డులోని పలు కాలనీల్లో రూ.1.58 కోట్ల 30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నార్సింగి హైట్స్‌లో హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ వాటర్ ట్యాంక్ పక్కన పార్కు, కుక్కల పార్కు ఏర్పాటుకు రూ.83 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. అదేవిధంగా వైఎస్ఆర్ విగ్రహం నుంచి నిర్మల ఆసుపత్రి వరకు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి 60 అడుగుల రోడ్డు వరకు, ఏఆర్ఎం కాఫీ ప్యాలెస్ నుంచి వరలక్ష్మి టిఫిన్ సెంటర్ వరకు రూ.94 లక్షలతో ఆర్‌సీసీ సెంట్రల్ మీడియన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గండిపేట్ 125వ వార్డులో అల్లు సినిమా నుంచి బస్‌స్టాప్ వరకు రూ.98 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. వట్టినాగులపల్లి గ్రామంలోని 126వ వార్డులో వివిధ కాలనీలు, వీధుల్లో రూ.1.66 కోట్ల 80 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. మొత్తంగా ఈ అభివృద్ధి పనుల ద్వారా నార్సింగి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పార్కులు, గ్రంథాలయాలు, రహదారుల అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. ఆయా ప్రాంతాల ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

కుంట్లూరులో అక్రమ నిర్మాణాల జోరు.. అధికారుల మౌనం

- జీ ప్లస్ టూ అనుమతులతో జీ ప్లస్ త్రీ నిర్మాణాలు.. పెంట్ హౌస్‌లుగా కమర్షియల్ భవనాలు!
- కెనరా బ్యాంకు సమీపంలో సెల్లార్‌తో జీ ప్లస్ త్రీ పెంట్ హౌస్ భవనం
- కుంట్లూరు వై జంక్షన్‌లోనూ నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ నిర్మాణం
- ఎక్స్ రోడ్డు వద్ద అనుమతులు లేకుండా డబుల్ సెల్లార్ తవ్వకాలు
- ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు.. స్థానికుల్లో అనుమానాలు

విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : నాగోల్ సర్కిల్ 11 పరిధిలోని కుంట్లూరు డివిజన్‌లో అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతున్నా అడ్డుకునే నాథుడే కరువయ్యాడా? జీ ప్లస్ టూ అనుమతులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా జీ ప్లస్ త్రీ నిర్మాణాలు చేపడుతున్నా, సెల్లార్ తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై సమాచారం ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వారి పనితీరుపై అనేక అనుమానాలకు తావిస్తోంది.

***కెనరా బ్యాంకు సమీపంలో జీ ప్లస్ టూ అనుమతులతో జీ ప్లస్ త్రీ పెంట్ హౌస్ భవనం**


కుంట్లూరు కెనరా బ్యాంకు సమీపంలో ఓ భవన నిర్వాహకుడు జీ ప్లస్ టూ అనుమతులు పొందినప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్‌తో పాటు జీ ప్లస్ త్రీ అంతస్తుల్లో పెంట్ హౌస్ భవన నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అనుమతులకు మించి అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారనే ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అనుమతులు, వాస్తవ నిర్మాణాల మధ్య వ్యత్యాసాన్ని అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.



కుంట్లూరు వై జంక్షన్ నందు అక్రమ నిర్మాణంలో ఉన్నటువంటి బిల్డింగ్ జి ప్లస్ టు పర్మిషన్ అదనపు ఫ్లోర్ తో భవన నిర్మాణం చేపడుతున్న నిర్వాహకులు

***కుంట్లూరు వై జంక్షన్‌లో మరో కమర్షియల్ అక్రమ నిర్మాణం**

కుంట్లూరు వై జంక్షన్ వద్ద మరో భవన నిర్వాహకుడు జీ ప్లస్ టూ అనుమతులు తీసుకొని, నిబంధనలకు విరుద్ధంగా పూర్తిస్థాయి కమర్షియల్ భవనంగా జీ ప్లస్ త్రీ పెంట్ హౌస్ నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పెంట్ హౌస్ నిర్వహణకు అనుగుణంగా అదనపు అంతస్తు నిర్మిస్తున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. నిర్మాణ అనుమతులు, భవనం వినియోగంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.



బిల్డింగ్ పర్మిషన్ G+2 కు తీసుకోని సెల్లర్ తోపాటు ఆధనపు ఫ్లోర్ నిర్మాణం చేపడుతున్న నిర్వాహకులు

ఎక్స్ రోడ్డులో డబుల్ సెల్లార్ తవ్వకాలు.. అధికారులకు కనిపించడం లేదా

కుంట్లూరు ఎక్స్ రోడ్డు వద్ద మరో నిర్మాణ నిర్వాహకుడు టౌన్ ప్లానింగ్, మైనింగ్ శాఖల అనుమతులు లేకుండానే డబుల్ సెల్లార్ తవ్వకాలు చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ స్థాయిలో తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు అటువైపు దృష్టి సారించడం లేదని విమర్శిస్తున్నారు. సెల్లార్ తవ్వకాల వల్ల పరిసర ప్రాంతాల్లోని భవనాలు, రహదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం.. మౌనం వెనుక మర్మమేమిటి

అక్రమ నిర్మాణాలపై స్థానిక ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను ఉల్లంఘించే నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ యంత్రాంగం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని ప్రజలు మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఈ వ్యవహారాల వెనుక ముడుపుల ప్రమేయం ఉందా? నిర్మాణదారులకు ఎవరి అండదండలు ఉన్నాయి? అన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.

ఉన్నతాధికారులు స్పందించేది ఎప్పుడు? అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడేదెప్పుడు

నాగోల్ సర్కిల్ 11 టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ తక్షణమే స్పందించి కెనరా బ్యాంకు సమీపం, కుంట్లూరు వై జంక్షన్, కుంట్లూరు ఎక్స్ రోడ్డు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే పనులను నిలిపివేసి, సంబంధిత నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారుల పాత్రపైనా విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు సామాన్యులకు మాత్రమేనా? నిర్మాణదారులకు వర్తించవా? ఫిర్యాదులు వచ్చినా స్పందించని అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా? లేక కుంట్లూరులో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతాయా? అన్న ప్రశ్నలకు సంబంధిత శాఖల సమాధానం కోసం స్థానిక ప్రజలు ఎదురుచూస్తున్నారు.

విశాలభారతి కథనానికి అధికార యంత్రాంగం స్పందన!


- నాలుగేళ్లుగా మూతపడిన పాఠశాల నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం
- జిల్లా కలెక్టర్ చొరవతో రూ.21.80 లక్షల బిల్లుల మంజూరు
- తిరిగి ప్రారంభమైన హనుమంతునిగూడెం పాఠశాల నిర్మాణ పనులు
- 122 మంది విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా



పునః నిర్మాణానికి ముందు.



పునః. నిర్మాణం





బడులు శిథిలం.. బోధన అద్దె భవనాల్లో!

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం.. అధికారులకు వరుస ప్రాతినిధ్యాలు.. ప్రజల గొంతుకగా పత్రికా కథనాలు.. వెరసి నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హనుమంతునిగూడెం ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి ఎట్టకేలకు కదలిక వచ్చింది. తెలంగాణ ప్రజల ఐక్య కార్యాచరణ సమితి (టీపీ జేఏసీ) చేసిన ప్రాతినిధ్యాలు, విశాల భారతి దినపత్రిక వెలువరించిన కథనాలకు జిల్లా కలెక్టర్ స్పందించారు. కాంట్రాక్టర్‌కు రావాల్సిన రూ.21.80 లక్షల బిల్లులు మంజూరు కావడంతో నిలిచిపోయిన పాఠశాల నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు హనుమంతునిగూడెంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దశాబ్దాల చరిత్ర కలిగిన విద్యాసంస్థ. సుమారు 1960కు పూర్వం నుంచే కొనసాగుతున్న ఈ పాఠశాల పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అధికారులు ఖాళీ చేయించారు. దీంతో విద్యార్థులు సమీపంలోని మరో పాఠశాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. 2022లో మన ఊరు – మనబడి పథకం కింద రూ.62 లక్షల అంచనా వ్యయంతో నూతన భవన నిర్మాణానికి అనుమతులు లభించాయి. నిర్మాణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ రెండు స్లాబులు నిర్మించినప్పటికీ, చేసిన పనులకు సంబంధించి సుమారు రూ.21.80 లక్షల బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. అప్పటి నుంచి నాలుగేళ్లుగా భవనం అసంపూర్తిగానే మిగిలిపోయింది. విద్యార్థుల చదువులకు ఇబ్బందిగా మారిన ఈ సమస్యపై టీపీ జేఏసీ అక్టోబర్ 2025 నుంచి ముఖ్యమంత్రి, స్థానిక శాసనసభ్యులు, రాజ్యసభ సభ్యులు, జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించింది. ప్రజావాణిలోనూ విద్యార్థులు, తల్లిదండ్రుల తరఫున సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. మరోవైపు విశాల భారతి దినపత్రిక పాఠశాల దుస్థితిని కథనాల రూపంలో ప్రచురిస్తూ అధికారుల దృష్టిని ఆకర్షించింది. టీపీ జేఏసీ ప్రాతినిధ్యాలు.. విశాల భారతి దినపత్రిక కథనాలు.. జిల్లా కలెక్టర్ స్పందనతో నాలుగేళ్ల సమస్యకు పరిష్కార మార్గం ఏర్పడింది. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన రూ.21.80 లక్షల బిల్లులు మంజూరు కావడంతో నిర్మాణ పనులు మళ్లీ పట్టాలెక్కాయి. ఈ పరిణామంతో పాఠశాలలో చదువుతున్న 122 మంది విద్యార్థులకు భవిష్యత్తులో మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. పాఠశాల పునర్నిర్మాణానికి స్పందించిన జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులకు టీపీ జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఇంకా అదనపు తరగతి గదులు, పాఠశాల భవనాలు అవసరమైన కంబాలపల్లి, జమాండ్లపల్లి, రామన్నపేట ఎస్టీ కాలనీ, పాత తండా, పత్తిపాక, బ్రహ్మంగారి తండా తదితర ప్రభుత్వ పాఠశాలలకు కూడా తక్షణమే నిధులు కేటాయించి నిర్మాణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ నిరాధార ఆరోపణలు సరికావు

- మైండ్ గేమ్‌లతో ప్రజలను మోసం చేయలేరు.
- కాంగ్రెస్ తీరుపై నిప్పులు చెరిగిన బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి.



కొత్తగూడెం విశాల భారతి: 6వ తేదీ శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఓటమి భయంతో వణికిపోతున్న కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘం పారదర్శకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (SIR) ప్రక్రియపై బురద జల్లడమే పనిగా పెట్టుకుందని బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. అధికార దాహంతో రాజ్యాంగ వ్యవస్థల విశ్వసనీయతను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ దిగజారుడు రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ నీచమైన డ్రామాలు ఆడడం సరికాదని ధ్వజమెత్తారు. ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లను తొలగించి, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేందుకు ఇసి చేపడుతున్న పారదర్శక ప్రక్రియను చూసి కాంగ్రెస్ నాయకుల్లో వణుకు మొదలైందన్నారు. గతంలో తాము చేసిన అక్రమాలు, బోగస్ ఓట్లు ఎక్కడ ఊడిపోతాయోనన్న అభద్రతా భావంతోనే ఇటువంటి అసత్య ప్రచారాలకు తెగబడుతున్నారు. రాజ్యాంగ వ్యవస్థలపై దాడి, ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవించడం కాంగ్రెస్ చరిత్రలోనే లేదన్నారు. ఎన్నికల్లో గెలిస్తే వ్యవస్థలు బాగున్నట్లు, ఓడిపోయే పరిస్థితి వస్తే ఇసి, ఈవిఎంలపై బురద జల్లడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. ఇది వారి రాజకీయ దివాళాకోరుతనానికి పరాకాష్ఠ అన్నారు. దమ్ముంటే చర్చకు రండి అంటూ బిజెపి అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి సవాల్ విసిరారు. కాంగ్రెస్ నాయకులకు నిజంగా ప్రజాస్వామ్యంపై నమ్మకం, తమ ఆరోపణల్లో సత్యం ఉంటే గాల్లో మాటలు మాట్లాడటం మాని మీరు చెప్పిన మాటల్లో వాస్తవాలు ఉంటే తగిన ఆధారాలతో బహిరంగ చర్చకు సిద్ధం కావాలంటూ. ఎక్కడ అక్రమాలు జరిగాయో నిరూపించ లేకపోతే ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి అంటూ. ప్రజలు పిచ్చి వాళ్లు కారు కాంగ్రెస్ చేసే కుట్రలు, చిల్లర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు. వారి ఉచిత విమర్శలను, గందరగోళ ప్రచారాన్ని ప్రజలు ఏమాత్రం నమ్మరు. క్షేత్రస్థాయిలో బిజెపి శ్రేణులు ప్రతి గడపకూ వెళ్లి కాంగ్రెస్ నకిలీ రంగును ఎండగడతామని ఈ సందర్భంగా చెప్పడం జరిగింది. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టి వారి అసలు స్వరూపాన్ని ప్రజల ముందు నగ్నంగా నిలబెడతామని బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, లక్ష్మీదేవి పల్లి మండల్ అధ్యక్షులు నవీన్, చుంచుపల్లి మండలాధ్యక్షులు బలగం శ్రీధర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు మోహన్ కృష్ణ, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి కోల హరీష్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు మంగీలాల్ నాయక్, ఎస్సీ మోర్చా కార్యదర్శి మహంకాళి శంకర్, సబ్బాని రాజేష్, లక్ష్మీదేవి పల్లి మండల కార్యదర్శి పవన్, ముకుంద నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముషీరాబాద్,విశాల భారతి: ఇంటర్ పోల్ ఏర్పాటు, నూతన సర్వీస్, అత్యవసర లైన్ మెయింటెనెన్స్‌లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏ డి ఈ జి. నాగేశ్వరరావు ప్రకటనలో పేర్కొన్నారు. నేడు శనివారం బర్కత్పురా ఫీడర్ 11 కె.వి పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి 12 గంటల 40 నిమిషాల వరకు పద్మ కాలనీ, పిబిఆర్ ఎస్టేట్, వెజిటేబుల్ మార్కెట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ అధికారులు సిబ్బందితో సహకరించాలని శుక్రవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో నాగేశ్వరరావు పేర్కొన్నారు.

హనుమకొండ జిల్లాలో SIR2026 జాబితాలో పేరు గల్లంతైన ఓటర్లకు మరో అవకాశం

- నవంబర్ 21లోగా దరఖాస్తులు, విచారణ ప్రక్రియ పూర్తి చేయాలి

విశాల భారతి /హనుమకొండ: ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR2026) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేకుండా ASDD (గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం, నకిలీ) కేటగిరీలో నమోదైన ఓటర్లకు మరో అవకాశం కల్పించినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్హులైన ఓటర్లు తమ పేర్లను తుది ఓటర్ల జాబితాలో చేర్చుకునేందుకు అవసరమైన దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రక్రియకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ, క్షేత్రస్థాయి పరిశీలన, EROల విచారణను నవంబర్ 21, 2026లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

దరఖాస్తు విధానం:

* అదే చిరునామాలో ఉన్నవారు: AnnexureA, AnnexureB ఫారమ్‌లను పూర్తి చేసి ERO/AERO/BLOలకు అందజేయాలి.
* తెలంగాణలో ఇతర ప్రాంతాలకు మారినవారు: కొత్త చిరునామా ఆధారంగా AnnexureA, AnnexureC ఫారమ్‌లు సమర్పించాలి.
* ఆన్‌లైన్‌లో: ECINET యాప్ లేదా ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా ఈసైన్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు.

భూ రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

- రైతులందరూ అధికారులకు సహకరించాలి.
- పారదర్శకత ఖచ్చితమైన డిజిటల్ భూ రికార్డుల ఏర్పాటు.
- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి.



విశాల భారతి ఇబ్రహీంపట్నం; భూ భారతి కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం మనోరాబాద్ గ్రామంలో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి అధ్యక్షతన భూ రీసర్వే అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డులను ఆధునికీకరించడం, భూముల కొలతల్లో ఖచ్చితత్వాన్ని పెంపొందించడం, భూ సరిహద్దు వివాదాలను పరిష్కరించడం, భూ యజమానుల హక్కులను స్పష్టంగా నిర్ధారించడం భూ రీసర్వే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆధునిక డిజిపిఎస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూములను అత్యంత ఖచ్చితత్వంతో సర్వే చేసి, డిజిటల్ భూ రికార్డులను రూపొందించడం జరుగుతుందని వివరించారు. రీసర్వే ద్వారా భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించడం వల్ల రైతుల మధ్య భూ వివాదాలు తగ్గుతాయని, భూముల విస్తీర్ణాన్ని కచ్చితంగా నిర్ధారించడంతో పాటు పాత భూ రికార్డులను డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు. భూ యాజమాన్య హక్కుల స్పష్టత, ప్రభుత్వ ప్రైవేటు భూముల ఆక్రమణల గుర్తింపు, భూముల సబ్‌డివిజన్ వివరాల నమోదు వంటి ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. ఖచ్చితమైన భూ రికార్డులు అందుబాటులో ఉండటం వల్ల రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంతో పాటు బ్యాంకు రుణాలు పొందేందుకు సైతం సౌలభ్యం కలుగుతుందని వివరించారు. రీసర్వే పూర్తయిన అనంతరం నిబంధనల ప్రకారం కొత్త భూ రికార్డులు, పట్టా వివరాలను డిజిటల్ విధానంలో పొందుపరచడం జరుగుతుందని తెలిపారు. అధికారులు మనోరాబాద్ గ్రామ భూ వివరాలను గ్రామసభలో వెల్లడించారు. గ్రామ మొత్తం భౌగోళిక విస్తీర్ణం 288 ఎకరాల 07 గుంటలు కాగా, మొత్తం 48 సర్వే నంబర్లు ఉన్నాయి. ఇందులో పట్టా భూమి 267 ఎకరాల 16 గుంటలు, ప్రభుత్వ భూమి 18 ఎకరాల 35 గుంటలుగా వివరించారు. ప్రభుత్వ భూముల్లో ఎండోమెంట్ భూమి 3 ఎకరాలు, ప్రభుత్వ భూమి 10 ఎకరాల 05 గుంటలు, లావణ్య పట్టా భూమి 5 ఎకరాల 30 గుంటలుగా గుర్తించినట్లు తెలిపారు. రీసర్వే చేయవలసిన సబ్‌డివిజన్ నంబర్లు 388 ఉన్నట్లు వెల్లడించారు. భూ రీసర్వే ప్రక్రియలో రైతులందరూ చురుకుగా భాగస్వాములై అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. రైతులు తమ భూములకు సంబంధించిన పాత రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్‌లు, ఇతర సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, సర్వే సమయంలో తమ భూముల సరిహద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించుకోవాలని కోరారు. పారదర్శకమైన, ఖచ్చితమైన డిజిటల్ భూ రికార్డుల వ్యవస్థ ఏర్పాటుకు భూ రీసర్వే ఎంతో దోహదపడుతుందని, దీనివల్ల భూ యజమానులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఎస్ఎల్ఆర్ ఎం. రామ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, మంచాల్ ఎమ్మార్వో వి .ప్రసాద్ రావు, ఇబ్రహీంపట్నం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే డి .శ్రీనివాస్, మండల సర్వేయర్ ఎస్. వి . ధనశ్రీ, మంచాల్ మండల లైసెన్స్ సర్వేయర్లు, గ్రామ పాలన అధికారి ఎన్. జంగయ్య, సర్పంచ్ ఏ . సంజీవ రెడ్డి, మంచాల్ మండల సిబ్బంది గ్రామ రైతులు హాజరయ్యారు.

నిబంధనలు పాటించని 30 దుకాణాలకు రూ.3 వేల జరిమానా



- నార్సింగి సర్కిల్‌లో "నో బిన్ – నో ట్రేడ్" కార్యక్రమంలో ప్రత్యేక తనిఖీలు

రాజేంద్రనగర్, విశాల భారతి : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వ్యాపార సంస్థల్లో పరిశుభ్రతను తప్పనిసరి చేయాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న "నో బిన్ - నో ట్రేడ్" కార్యక్రమంలో భాగంగా నార్సింగి సర్కిల్ 45 పరిధిలో అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గండిపేట గ్రామంలోని 126వ వార్డులో చేపట్టిన ఈ తనిఖీల్లో నిబంధనలు పాటించని వ్యాపార సంస్థలపై జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో భాగంగా అధికారులు మొత్తం 30 వ్యాపార దుకాణాలను పరిశీలించారు. చెత్త సేకరణకు అవసరమైన బిన్లు ఏర్పాటు చేసుకోకుండా, పారిశుద్ధ్య నిబంధనలు పాటించని 30 దుకాణాలకు ఒక్కొక్క దుకాణానికి రూ.100 చొప్పున మొత్తం రూ.3,000 జరిమానా విధించారు. వ్యాపార సంస్థల నిర్వాహకులు పారిశుద్ధ్య నిబంధనలను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి వ్యాపార సంస్థలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ప్రత్యేక చెత్త బుట్టలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దుకాణాల నుంచి వెలువడే వ్యర్థాలను రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో పడవేయకుండా నిర్ణీత పద్ధతిలో సేకరించి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. దుకాణాల ముందు, చుట్టుపక్కల పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతరం పరిశుభ్రతను పాటించాలని స్పష్టం చేశారు. పట్టణాలు, గ్రామాల పరిశుభ్రత కేవలం మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, వ్యాపారస్తులు, ప్రజలు కూడా ఇందులో భాగస్వాములు కావాలని అధికారులు పేర్కొన్నారు. చెత్తను తడి, పొడి అని వేరు చేయడం ద్వారా వ్యర్థాల నిర్వహణ సులభతరం అవుతుందని, పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. నిబంధనలు పాటించని వ్యాపార సంస్థలపై తనిఖీలు కొనసాగుతాయని, ప్రతి దుకాణంలో చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. పరిశుభ్రమైన నార్సింగి సర్కిల్ నిర్మాణమే లక్ష్యంగా "నో బిన్ - నో ట్రేడ్" కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామని నార్సింగి సర్కిల్ 45, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

కరువు కోరల్లో మహబూబాబాద్ జిల్లా

- రైతాంగాన్ని ఆదుకోవడంలో జాప్యమెందుకు?
- మధ్యస్థ కరువు మండలాల ప్రకటనతో చేతులు దులుపుకోవద్దు.
- జిల్లా మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలి.
- పంటలు పండక.. రబీ సాగుకు అవకాశం లేక రైతులు అల్లాడుతున్నారు.
- సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి

కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే ప్రభుత్వం మాత్రం కరువు మండలాల ప్రకటనలకే పరిమితం కావడం సరికాదని, మహబూబాబాద్ జిల్లా మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి డిమాండ్ చేశారు. కురవి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సీపీఐ బృందం పర్యటించి క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితులను పరిశీలించింది. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. జిల్లాలో సాధారణంగా 911.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 681 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైందని, దాదాపు 25 శాతం లోటు వర్షపాతం రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పంటల సాగు దెబ్బతినగా, రబీ సీజన్‌లోనూ సాగుకు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా



మారిందన్నారు. కరువు తీవ్రతను అంచనాల పేరుతో పరిమితం చేయొద్దు! రకరకాల ప్రమాణాలతో మండలాల వారీగా కరువును నిర్ధారించి రైతులకు అందాల్సిన సహాయాన్ని పరిమితం చేయకుండా, జిల్లా వ్యాప్తంగా నెలకొన్న వాస్తవ పరిస్థితులను గుర్తించి మొత్తం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పశువులకు అవసరమైన పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచాలని, వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనిదినాలు పెంచాలని కోరారు. ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు పంటలకు గిట్టుబాటు ధర, మార్కెట్ భద్రత కల్పించాలని స్పష్టం చేశారు. పంటలు సాగు చేయలేని రైతులను గుర్తించి ఎకరాకు కనీసం రూ.20 వేల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి వ్యవసాయాన్ని కొనసాగించలేని పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి కరువు సహాయక చర్యలు ప్రారంభించాలని విజయసారథి కోరారు. ఈ పర్యటనలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, మండల కన్వీనర్ బుడమ వెంకన్న, మండల సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, కురవి పట్టణ కార్యదర్శి తురక రమేష్, రవీందర్ నాయక్, టి. రమేష్, రవి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరిన వేళ.. ఆనందం వ్యక్తం చేసిన లబ్ధిదారులు

- ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం చేసిన ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి



విశాల భారతి నిజామాబాద్ ప్రతినిధి : ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవారి సొంతింటి కలను సాకారం చేస్తూ.. వారి ముఖాల్లో చిరునవ్వులు కాంగ్రెస్ ప్రభుత్వం నింపుతుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్. భూపతి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మోపాల్ మండల పర్యటనలో భాగంగా సింగంపల్లి గ్రామానికి చెందిన గోరుకంటి మానసడిశెందర్ లకు చెందిన ఇందిరమ్మ ఇంటిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు వారి ఆనందాన్ని ఎమ్మెల్యేతో పంచుకున్నారు. సంతోషంతో మిఠాయిలు తినిపించారు. ఈ మేరకు ఎమ్మెల్యే వారితో ఆప్యాయంగా మాట్లాడి.. వారి సంతోషంలో భాగస్వాములయ్యారు.

భారతీయురాలిగా గర్విస్తున్నా..

నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన పౌరాణిక చిత్రం 'రామాయణ' నవంబరు 6న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుంది. అయితే ఈ సినిమాలో శూర్పణఖ కీలక పాత్రలో నటించిన ప్రముఖ నటి రకుల్ ప్రీత్‌సింగ్ తాజాగా తన అనుభవాలను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. భారతీయుల సంస్కృతికి ప్రతీక అయిన రామాయణ గాథను ఇంత భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక విలువలతో వెండితెరపై ఆవిష్కరించడం తన జీవితంలో మరువలేని అద్భుతమైన అనుభూతినిచ్చిందని రకుల్ పేర్కొన్నారు. ఈ గొప్ప ప్రాజెక్ట్‌ను తెరకెక్కించేందుకు కృషి చేసిన నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితేశ్ తివారీలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భారత్ నుంచి ప్రపంచ స్థాయికి ఓ అద్భుతమైన సినిమాను అందించాలనే వారి తపన తనకెంతో స్ఫూర్తినిచ్చిందని కొనియాడారు. ఈ చిత్రంలో తనతో పాటు నటించిన రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, రవిదూబే, కాజల్ అగర్వాల్‌లతో పాటు సినిమా నిర్మాణంలో భాగమైన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాత్ర కోసం రోజూ నాలుగు గంటల పాటు ఎంతో శ్రమించి తనను శూర్పణఖ రూపంలోకి తీసుకువచ్చిన కాస్ట్యూమ్ మరియు మేకప్ బృందాల కృషిని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది కేవలం తాను నటించిన మరో సినిమా మాత్రమే కాదని, భారతీయురాలిగా తాను ఎప్పటికీ గర్వపడే అరుదైన క్షణమని రకుల్ భావోద్వేగంతో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.